సాక్షి ఖమ్మం

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



క్రీడాస్ఫూర్తి పెరగాలి

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరిగితే అన్ని రంగాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తారని వైరా ఎమ్మెల్యే రాందాస్ తెలిపారు.

8లో



కలెక్టర్‌పై దాడికి నిరసన

వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

8లో

గరిష్టం / కనిష్టం

31° / 22°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

న్యాయ సేవాధికార సంస్థలో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఖమ్మం లీగల్: న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్ తెలిపారు. జూనియర్ అసిస్టెంట్(జనరల్), స్టెనో/టైపిస్టు(జనరల్), టైపిస్ట్ కం అసిస్టెంట్ (జనరల్–మహిళ), రికార్డ్ అసిస్టెంట్(జనరల్–మహిళ) తదితర పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు దరఖాస్తులను కొరియర్ లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా 'చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవాసదన్, జిల్లా కోర్టు సముదాయం, ఖమ్మం' చిరునామాకు ఈనెల 21న సాయంత్రం 5గంటల్లోగా అందేలా పంపించాలని సూచించారు. పరీక్షల షెడ్యూల్‌ను జిల్లా కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

రేపటి నుంచి 'ఈశా' గ్రామోత్సవం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి గ్రామోత్సవం పేరిట ఈనెల 16, 17వ తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. వాలీబాల్, త్రోబాల్ అంశాల్లో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో రాష్ట్ర స్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈమేరకు పోటీల వాల్‌పోస్టర్లను గురువారం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ ఎండీ.అక్బర్ అలీతో కలిసి ఆవిష్కరించారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం, డీఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని సూచనలు స్వీకరించేందుకు శుక్రవారం యువర్ ఆర్ఎం, డీఎం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్ పరిధిలోని సమస్యలను వెల్లడించేలా ఆర్ఎంతో మాట్లాడేందుకు మధ్యాహ్నం 12నుండి ఒంటి గంట వరకు 99592 25954 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే, ఖమ్మం డిపో పరిధిలోని ప్రాంతాల ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4నుండి 5గంటల వరకు 99592 25958 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



మిర్చి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

ఏన్కూరు: రైతులు వరిధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మడం ద్వారా మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఏఓ ఏ.నర్సింహారావు, ఏఈఓలు బాలకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వికాస కేంద్రాలుగా గ్రంథాలయాలు



వారోత్సవాలను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంగాంధీచౌక్: గ్రంథాయాలు విజ్ఞానాన్ని పంచడమే కాక వికాస కేంద్రాలుగా విలసిల్లుతున్నాయని ఖమ్మం మేయర్ పి.నీరజ తెలిపారు. ఖమ్మంలోని జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లా లైబ్రరీలో చదువుకుని ఇటీవల డీఎస్సీలో 12 మంది ఉద్యోగాలు సాధించగా, పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. గ్రంథాలయ కార్యదర్శి అర్జున్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించడమే కాక పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, కేవీఎస్ఎల్ ఎన్.రాజు, ఎండీ.ఇమామ్, కనకవల్లి, భాస్కర్, అఖిల్, బాబు, రవిబాబు, లలితకుమారి, శ్రీనివాస్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది?

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కూటమి కట్టిన వ్యాపారులు తేమ శాతం కూడా పరిశీలించకుండానే పత్తి ధర నిర్ణయిస్తుండడం.. ఇదేమిటని అడిగితే 'ఇష్టం ఉంటే అమ్మండి.. లేకుంటే మీ ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాకు రూ.500మేర నష్టం ఎదురవుతుండగా.. సిండికేట్ దందాను మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పత్తి

- ఖమ్మం మార్కెట్‌లో పత్తి దందాపై సీఎంఓ ఆరా
- సిండికేట్‌గా మారి రైతులను దగా చేస్తున్న వ్యాపారులు
- సీసీఐ కేంద్రాల్లోనూ దక్కని మద్దతు ధర
- కేంద్రాల్లో అధికారులు, పోలీసుల పరిశీలన

కలెక్టర్ తనిఖీల్లో మోసాల గుర్తింపు

రెండు రోజుల క్రితం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మార్కెట్‌ను తనిఖీ చేసిన సమయాన 9శాతం తేమ ఉన్న పత్తికి నిబంధనల ప్రకారం రూ.7,445.79 ధరకు బదులు తక్కువ నిర్ణయించినట్లు గుర్తించారు. దీంతో పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తే మార్కెట్ అధికారుల ఉద్యోగాలు ఊడుతాయని హెచ్చరించడమే కాక వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అయినా మరుసటి రోజు వ్యాపారులు తీరు మారకపోవడం గమనార్హం. మరోపక్క సీసీఐ కేంద్రాల్లోనూ వ్యాపారులు తెచ్చిన పత్తికే ఎలాంటి కొర్రీలు లేకుండా మద్దతు ధర నిర్ణయిస్తుండగా రైతులు తీసుకొస్తే మాత్రం కొర్రీలతో ధర తగ్గిస్తున్నారనే అంశంపై జిల్లా ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి(సీఎంఓ) నివేదిక వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఖమ్మం మార్కెట్, సీసీఐ కేంద్రాల్లో ఏం జరుగుతోందని ఆరా తీస్తుండగా, జిల్లాస్థాయి అధికారులతో పాటు మునుపెన్నడూ లేని విధంగా పోలీసు అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్నారు.

రూ.6,800కు మించని ధర

రాష్ట్రంలో వరంగల్ ఎనుమాముల మార్కెట్ తర్వాత ఆ స్థాయిలో ఖమ్మం మార్కెట్‌కు పత్తి తీసుకొస్తారు. జిల్లాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాల నుంచి పత్తి తీసుకొస్తుండగా 19 మంది ఖరీదుదారులే కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం 8నుంచి 12శాతం వరకు ఉంటే రూ.7,521 నుంచి రూ.7,220.16 వరకు మద్దతు ధర చెల్లించాలి. కానీ యంత్రాలతో పరీక్షించకుండా చేతులతో చూసి తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత లేదంటూ ఇష్టారీతిన ధర నిర్ణయిస్తున్నారు. తద్వారా నాణ్యమైన పత్తికి సైతం రూ.6,800 ధర మించకున్నా చేసేదేం లేక రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది.

సీసీఐ కేంద్రాల్లోనూ అదే తీరు

జిల్లాలోని తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఏడు కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. ఇక్కడ 8నుంచి 12 శాతం వరకు తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు పత్తిని ఎండబెడుతూ పడిగాపులు కాస్తున్నారు. ఇదే సమయాన వ్యాపారులు తీసుకొస్తే మాత్రం పత్తి కొంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేశారో ఆధార్‌కార్డు తదితర వివరాలు నమోదు చేయకపోవడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది.

చూస్తుంటాం అంతే..

మార్కెట్‌లో రైతులు నిలువుదోపిడీకి గురవుతున్నా అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతులు తీసుకొచ్చిన పత్తిని యంత్రాలతో కాకుండా పైపైన చూసి వ్యాపారులు ధర నిర్ణయిస్తున్నారు. ఇదంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా పట్టించుకోకపోవడం, కలెక్టర్ హెచ్చరించినా తీరు మారకపోవడం.. మరోపక్క వ్యాపారులు మేమింతే అన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ఇంటెలిజెన్స్ ద్వారా నివేదిక

ఖమ్మం మార్కెట్, సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి లోపాలపై జిల్లా ఇంటెలిజెన్స్ విభాగం నుంచి సీఎంఓకు రెండు రోజుల క్రితం నివేదిక వెళ్లినట్లు సమాచారం. స్వయంగా కలెక్టర్ పరిశీలనలోనూ తేమ పరీక్షించకుండా నాణ్యమైన పత్తికి తక్కువ ధర నిర్ణయించినట్లు తేలింది. దీంతో ఇంటెలిజెన్స్ విభాగం నుంచి సీఎంఓకు నివేదిక పంపించగా అక్కడి నుంచి జిల్లా స్థాయి అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. దీంతో జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధరపై రైతులను ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా తేమ శాతాన్ని స్వయంగా పరీక్షిస్తున్నారు. పత్తి రైతులు నష్టపోయేలా వ్యవహరిస్తున్న వ్యాపారులు, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో ఇప్పటివరకు పత్తి కొనుగోళ్లు (క్వింటాళ్లలో)	ఖమ్మం మార్కెట్	సీసీఐ కొనుగోలు కేంద్రాలు	ప్రైవేట్ వ్యాపారులు	మొత్తం
	1,12,350	22,700	59,482	1,94,532

గ్రూప్–3 పరీక్షలకు సర్వం సిద్ధం..

- పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అర గంట ముందే సెంటర్ల గేట్లకు తాళాలు
- ఉద్యోగుల శిక్షణ శిబిరంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు ఖమ్మం ఎస్‌బీఐటీలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5–30 వరకు రెండు సెషన్లు, 18న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. జిల్లా నుంచి పరీక్షలకు హాజరుకానున్న 27,984 మంది అభ్యర్థుల కోసం 87 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 16వ తేదీన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సమావేశమై ఏర్పాట్లు సరిచూసుకోవాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 8–30నుంచి 9–30గంటల వరకు, మధ్యాహ్నం 1–30నుంచి 2–30 గంటల వరకే అనుమతిస్తామనే విషయాన్ని అభ్యర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, షూ కాకుండా చెప్పులు మాత్రమే వేసుకొచ్చేలా ప్రచారం చేయాలని, ప్రతీ అభ్యర్థి వివరాలు బయోమెట్రిక్ ద్వారా నిర్ధారించుకున్నాకే అనుమతించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, ఎస్‌బీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, విజయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై 17న విచారణ

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై ఈనెల 17న బహిరంగ విచారణ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో 17న ఉదయం 11–30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విచారణ జరగనుండగా, బీసీ కమిషన్ డెడికేషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు పాల్గొంటారని చెప్పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రజలు, సంఘాల నాయకులు రిజర్వేషన్ల అంశంపై అభ్యర్థనలు, సలహాలు అందచేయాలని సూచించారు.

నేడు జయంతి వేడుకలు

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మంలోని గిరిజన భవన్‌లో ఉదయం 10.30గంటలకు ఉత్సవాలు మొదలవుతాయని, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.

కార్తీక పౌర్ణమి సందడి

కార్తీక పౌర్ణమి శివకేశవులకు ప్రీతిపాత్రమైన రోజు. ఈరోజు దీపం వెలిగిస్తే సర్వపాపాలు హరించడమే కాక అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మిక. ఈమేరకు శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు చేరుకుని పూజలు చేసి దీపాలు వెలిగించనున్నారు. ఈసందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అంతేకాక పలువురు నదీస్నానానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో జ్వాలా తోరణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా, పూలు, ఇతర పూజా సామగ్రి కొనుగోళ్లతో జిల్లా కేంద్రంలోని కమాన్ బజార్, కస్బాబజార్, గాంధీచౌక్ తదితర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. – ఖమ్మంగాంధీచౌక్



విద్యుత్ లైట్ల వెలుతురులో ఖమ్మం శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం

భక్తులకు బాధలే..!

పర్వదినాల్లో భద్రాద్రికి పోటెత్తుతున్న భక్తులు

- ముక్కోటి, నవమికే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇతర పండుగ రోజుల్లో నామమాత్రపు చర్యలతోనే సరి
- మహిళలు వస్త్రాలు మార్చుకునే గదులు, మొబైల్ టాయిలెట్లూ కరువే



స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో పర్వదినాల సందర్భంగా సీతారాముల దర్శనం, పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులు సరైన ఏర్పాట్లు లేక ఇబ్బంది పడుతున్నారు.

రెండు రాష్ట్రాల నుంచి..

భద్రాచలంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దేశ వ్యాప్తంగా ఈ ఆలయం ప్రసిద్ధి. ముఖ్యంగా శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారాముల కల్యాణం, ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారా దర్శనం చేసుకునేందుకు వేలాది మంది భక్తులు భద్రాచలం చేరుకుంటారు. ఈ రెండు పర్వదినాల సందర్భంగా వచ్చే భక్తులకు సేవలు అందించడంపై మాత్రమే దేవాదాయ శాఖ దృష్టి పెడుతోంది. రూ.కోటి పైగా వ్యయంతో ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ రెండు ఉత్సవాలతో పాటు ఇతర పర్వదినాల్లోనూ వేల సంఖ్యలో భక్తులు వస్తున్నా.. వారి కోసం ఆలయం ఆధ్వర్యంలో ఎలాంటి సౌకర్యాలూ కల్పించడం లేదు.

హనుమాన్ మాలధారులతో..

హనుమాన్ మాల ధారణ సమయంలో భద్రాచలానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. గతేడాది 50 వేల మందికి పైగా భక్తులు రెండు రాష్ట్రాల నుంచి తరలిరావడంతో పట్టణ వీధులు, ఆలయ ప్రాంగణం, గోదావరి తీరం కిక్కిరిసిపోయాయి. స్నానాలు, దర్శనాల సమయంలో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమయాల్లో అయినా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుంటే ఎలా అని హనుమాన్ మాల ధారులతో పాటు సాధారణ భక్తులు సైతం ఆవేదన చెందుతున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద, గోదావరి తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఉగాది, తొలి ఏకాదశి వంటి పండుగలు, సెలవు రోజుల్లోనూ కుటుంబ సమేతంగా రామయ్య దర్శనానికి భక్తులు వస్తుండగా, వారికీ ఇక్కట్లు తప్పడం లేదు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి..

గోదావరికి వరదలు వచ్చిన సమయంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు. ప్రైవేటు సంస్థలకు చెందిన వాహనాలతో పాటు ఆర్టీసీకి చెందిన మొబైల్ టాయిలెట్లను సైతం ఇక్కడికి రప్పిస్తారు. అదే తరహాలో కార్తీక పౌర్ణమి, ఉగాది, హనుమాన్ జయంతి వంటి ప్రత్యేక రోజుల్లో స్త్రీలు బట్టలు మార్చుకునే సౌకర్యాలతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తులు భద్రాచలంలో బస చేసేందుకు వీలుగా విశాలమైన హాలు, డార్మిటరీలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

దీపాలు వెలిగించేందుకు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించేందుకు భద్రాచలానికి పోటెత్తుతారు. ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. తెల్లవారుజాము నుంచే గోదావరి తీరంలో సందడి మొదలవుతుంది. అయితే గోదావరి తీరం వెంట స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు కూడా తగిన వసతులు లేవు. ఇందుకోసం స్నానఘట్టాల దగ్గర ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. దాదాపు 500 మీటర్ల పొడవునా భక్తులు స్నానాలు చేస్తుంటారు. అయితే స్త్రీలు బట్టలు మార్చుకునే అవకాశం కేవలం ప్రధాన మెట్ల వద్దే ఉంది. ఇక్కడికి దూరంలో స్నానం చేసే మహిళా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా టాయిలెట్ల విషయంలోనూ అదనపు ఏర్పాట్లు లేవు.



గోదావరి తీరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అన్నాతమ్ముళ్లకు గ్రూప్‌-4 ఉద్యోగాలు



రత్నేశ్వరనాయుడు, సాయికృష్ణమనాయుడు

కామేపల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం విడుదల చేసింది. ఇందులో కామేపల్లి మండలం గోవింద్రాల బంజరకు చెందిన గంగారపు సత్యనారాయణ – జ్యోతి కుమారులు రత్నేశ్వరనాయుడు, సాయికృష్ణమనాయుడు ఎంపికయ్యారు. వీరిద్దరు 5, 35వ ర్యాంకుతో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు. కాగా, వీరిద్దరికి గతంలోనూ కోర్టుల్లో ఉద్యోగాలు రాగా సాయికృష్ణ మాత్రమే ఉద్యోగంలో చేరాడు. ఆపై గ్రూప్ – 4 రాసి ఇద్దరూ ఉద్యోగాలు దక్కించుకున్నారు. అంతేకాక మండలంలోని జాస్తిపల్లికి చెందిన మల్లెంపాటి ప్రియాంక 135, పింజరమడుగుకు చెందిన కేలోత్ సాయికుమార్ 7వ ర్యాంక్‌తో గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

కేశ్వాపురం నుంచి ఇద్దరు..

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురానికి చెందిన ఇద్దరు గ్రూప్ – 4 ఉద్యోగాలు సాధించారు. మేదరమెట్ల చరణ్, తాళ్లూరి శివ వార్డు ఆఫీసర్లుగా ఎంపికవగా పలువురు అభినందించారు.

సత్తుపల్లి ఫైర్‌మ్యాన్..

సత్తుపల్లి టౌన్: సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రం ఫైర్‌మాన్ వి.రాజేందర్ గ్రూప్–4 ఉద్యోగం సాధించారు. ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన ఆయన మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం లీగల్: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల సాధనకు చదువుపై దృష్టి సారించాలే తప్ప మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని న్యాయ జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఖమ్మం జలగంనగర్‌లోని రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలలు క్రమశిక్షణతో ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలన్నారు. చెడు అలవాట్లు, సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దని హితవు పలికారు. హెచ్ఎం సత్యనారాయణ, పారా లీగల్ వలంటీర్ అన్నపూర్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- కాంటా పూర్తికాగానే మిల్లులకు తరలింపు
- రైతులకు సమస్య ఎదురైతే 1077 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు..
- అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి



పి.శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా సాగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల వివరాలను వెల్లడించారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 324 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో 267 సన్నరకాల కోసం, 58 దొడ్డు రకాల సేకరణకు ఏర్పాటయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు 298 మంది రైతుల నుంచి 2,444.320మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా నాణ్యత ఆధారంగా తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని చెప్పారు.

కేంద్రాల వద్ద సౌకర్యాలు

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా టెంట్లు తదితర సౌకర్యాలు కల్పించామని అదనపు కలెక్టర్ తెలిపారు. అలాగే, కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడంతో సన్న, దొడ్డురకం ధాన్యం గుర్తింపుపై అవగాహన కల్పించామని చెప్పారు. ఇప్పటివరకు 2,444.320 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే అందులో 2వేల మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించామని తెలిపారు. ఒకేసారి ధాన్యం అధికంగా వచ్చినా సమస్య రాకుండా గోదాంలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 9,24,000 గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని 67మిల్లుల్లో ఇప్పటి వరకు 46 మిల్లులు ఒప్పందం కుదుర్చుకున్నందున ఎప్పటికప్పుడు ధాన్యం తరలిస్తున్నామని ఆయన తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం దృష్ట్యా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్‌గా అందుతుందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయిస్తే మద్దతు ధర దక్కుతుందని చెప్పారు. గ్రేడ్–ఏ ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320, సాధారణ రకాలు క్వింటాకు రూ.2,300గా ధర నిర్ణయించగా.. రైతులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 1077కు ఫోన్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11–30నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఆతర్వాత జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలకు ఎంపీ హాజరవుతారు.

వీవీసీ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు


ఆస్పత్రి ఉద్యోగికి వాహనం తాళాలు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: వీవీసీ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యాక్రమాలను చేపడుతున్నట్లు ట్రస్ట్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన సోదరుడు వెంకటరమణప్రసాద్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని వీవీవీ గార్డెన్స్‌లో రమణప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పించగా వీవీసీ గ్రూప్ ఉద్యోగులు 60 మంది రక్తదానం చేశారు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి రూ.5లక్షల విలువైన వాహనం, ఖమ్మం శివారు చినతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.15వేల విలువైన బ్యాగ్‌లు, పుస్తకాలను రాజేంద్రప్రసాద్ అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ద్రౌపతి, డైరెక్టర్లు వికాస్‌చౌదరి, వీరేన్ చౌదరి, విక్రమాదిత్య పాల్గొన్నారు.

జాతీయ రహదారి సర్వే అడ్డగింత

చింతకాని: మండలంలోని కొదుమూరు సమీపాన నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే కోసం గురువారం అధికారులు రాగా రైతులు అడ్డుకున్నారు. బావులు, బోర్లు, చెట్ల లెక్కింపునకు అధికారులు రావడంతో పూర్తి స్థాయి పరిహారం ఇచ్చాకే సర్వే చేయాలని రైతులు తేలిచెప్పగా వారు వెనుదిరిగారు.

రూ.10లక్షలకు ఐపీ దాఖలు చేసిన వ్యాపారి

ఖమ్మం లీగల్: ఖమ్మంలో స్టీల్ సామగ్రి వ్యాపారం చేసిన బిజ్జల భాస్కర్ రూ.10 లక్షలకు గాను దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. వ్యాపార అభివృద్ధి పలువురి అప్పులు చేయగా, నష్టం రావడంతో తీర్చలేని పరిస్థితి ఎదురైందని ఆయన పిటీషన్‌లో పేర్కొన్నారు. నలుగురిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది అమ్జద్ పాషా ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం దివాలా పిటీషన్ దాఖలు చేశాడు.

మూడు టిప్పర్లు సీజ్

వేంసూరు: గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో ఉపయోగించేందుకు అనుమతి మించి మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఎం.ఏ.రాజు తెలిపారు. అనంతరం వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఇల్లెందు: ఇల్లెందులోని నంబర్–2 బస్తీకి చెందిన లక్కా ఐలమ్మ (58) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. రెండేళ్ల క్రితం భర్త రాములు మృతిచెందడంతో ఒంటరిగా ఉంటూ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాల్వంచరూరల్: తల్లిపై దాడి చేసిన ఘటనలో కుమారుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కాంతోజు వీరమ్మ, ఆమె కుమారుడు లవాచారి మధ్య ఇంటి విషయంలో కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం మరోసారి గొడవపడ్డారు. తనను కొట్టి బూతులు తిట్టాడని తల్లి ఫిర్యాదు చేయగా, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	---	---
మిర్చి	14,800	6,000
మిర్చి తాలు	7,000	7,000
ఏసీ మిర్చి	16,900	7,000
పత్తి	6,850	5,800

– ఖమ్మం వ్యవసాయం

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరగాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- ముగిసిన జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు


విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్, తదితరులు

వైరా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, తద్వారా క్రీడాస్ఫూర్తి పెరిగి గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న గురుకులాల జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం ముగిశాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని గురుకులాల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం అలవడుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.జైపాల్, డీసీఓ రాజ్యలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు శివకుమారి, చావా జ్యోతి, లిల్లీ, ఎం.పద్మావతి, గంటేల సునీత, పీ.వీ.పద్మావతి, టి.విజయదుర్గ, ఉద్యోగులు టి.సాయికిరణ్, ఎం.డీ.షాకీరా తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్లుగా వైరా, భద్రాచలం, ఇల్లెందు

జోనల్ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో వైరా, భద్రాచలం, ఇల్లెందు గురుకులాలు విద్యార్థులు వరుసగా అండర్–14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. అలాగే, వ్యక్తిగతంగా అండర్–14 విభాగం నుంచి ఎస్.ఎస్.భార్గవి(వైరా), అండర్–17లో కె.స్రవంతి (భద్రాచలం), అండర్–19లో ఎస్.సరిత (ఇల్లెందు) ట్రోఫీ అందుకున్నారు. ఇక వ్యకిగత క్రీడల్లో అండర్–14, 17 విభాగాలకు సంబంధించి ములకలపల్లి గురుకుల విద్యార్థులు, అండర్–19 విభాగంలో కల్లూరు గురుకుల విద్యార్థులు అత్యధిక పాయింట్లు సాధించారు. అలాగే, అండర్–14 కబడ్డీలో ములకలపల్లి, కల్లూరు, ఖో–ఖోలో ములకలపల్లి, అడవిమల్లెల, టెన్నికాయిట్ డబుల్స్‌లో దానవాయిగూడెం, వైరా, కార్యమ్స్ డబుల్స్‌లో నేలకొండపల్లి, కూసుమంచి, చదరంగంలో అడవిమల్లెల, ఎర్రుపాలెం, అండర్–17 కబడ్డీలో ములకలపల్లి, వైరా, ఖో–ఖోలో ఎర్రుపాలెం, ములకలపల్లి, వాలీబాల్‌లో భద్రాచలం, కూసుమంచి, బాల్ బ్యాడ్మింటన్‌లో మధిర, వైరా, టెన్నికాయిల్ డబుల్స్‌లో దానవాయిగూడెం, పాల్వంచ విద్యార్థులు, క్యారమ్ డబుల్స్‌లో టేకులపల్లి, ములకలపల్లి, చదరంగంలో నేలకొండపల్లి, ములకలపల్లి విద్యార్థులు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.

ఇక అండర్–19 విభాగం కబడ్డీలో ములకలపల్లి, అడవిమల్లెల, ఖో–ఖోలో కల్లూరు, ఎర్రుపాలెం, వాలీబాల్‌లో కల్లూరు, అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, హ్యాండ్‌బాల్‌లో కల్లూరు, టేకులపల్లి, బాల్ బ్యాడ్మింటన్‌లో మధిర, వైరా, టెన్నికాయిట్ డబుల్స్‌లో దానవాయిగూడెం, వైరా, క్యారమ్స్ డబుల్స్‌లో ఎర్రుపాలెం, అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, చదరంగంలో అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, అడవిమల్లెల విద్యార్థులు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసన


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: భూసేకరణపై చర్చించేందుకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్, పలువురు అధికారులపై దాడి చేయడం గర్హనీయమని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో జేఏసీ ఆధ్వర్యాన గురువారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కలెక్టర్, అధికారులపై దాడిని ఖండిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు. జేఏసీ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదన శ్రీనివాస్, కస్తాల సత్యనారాయణ, వేలాద్రి, తుంబూరు సునీల్‌రెడ్డి, రాజశేఖర్, యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీకాంత్, సైదులు, వి.వెంకన్న, వీరన్న, రుక్మారావు, శంకర్, అంజమ్మ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, వీఆర్వో సంక్షేమ సంఘం ఆధ్వర్యాన కూడా నిరసన తెలపగా రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావుతో పాటు పూర్వ వీఆర్వోలు, ఉద్యోగులు భాస్కర్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో పాల్గొన్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

పంచవర్ష ప్రణాళికలకు ఆద్యుడు నెహ్రూ


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్, రాయల, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించిన స్వాతంత్ర్య పోరాటయోధుడు జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో దోపిడీకి గురైన దేశ ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టేలా పంచవర్ష ప్రణాళికలు అమలుచేసిన నెహ్రూ సేవలు మరువలేనివని తెలిపారు. అతర్వాత ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో పాటు పోట్ల నాగేశ్వరరావు, తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు నివాళుర్పించారు. ఈకార్యక్రమాల్లో నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, రాపర్తి శరత్, సయ్యద్ గౌస్, పాలకుర్తి నాగేశ్వరరావు, మద్దినేని రమేష్, రషీద్, బమ్మిడి శ్రీనివాస్, కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

చింతకాని: ప్రజలు తమ ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత్రపైనా శ్రద్ధ వహించాలని, తద్వారా వ్యాధులు దరిచేరవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి తెలిపారు. మండలంలోని కొదుమూరులో గురువారం ఏర్పాటుచేసిన ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారాన్ని అందించాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానాను పరిశీలించగా డీపీఓలు దుర్గా, రఘురాం, వైద్యులు అల్తాఫ్, వెంకటేశ్వరరావు, ఉద్యోగులు నాగేశ్వరరావు, రేఛల్‌రాణి, పద్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్–14 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్


పోటీలకు సిద్ధం చేసిన అథ్లెటిక్స్ ట్రాక్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–14 అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు ఖమ్మంలో శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానుండగా తొమ్మిది ఈవెంట్లలో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. కాగా, శుక్రవారం జరిగే ప్రారంభోత్సవ సమావేశానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అండర్–19 కరాటే టోర్నీ

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి కరాటే టోర్నీ నిర్వహించనున్నారు. జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈ పోటీలు జరుగుతాయని సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. తొలిరోజు క్రీడాకారుల ఎంట్రీలు నమోదు చేసి, ఆతర్వాత రెండు రోజులు పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

రూ.4లక్షలతో 'నోష్' కంప్యూటర్ ల్యాబ్

వేంసూరు: వేంసూరు జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో నోష్ ల్యాబ్ సమకూర్చిన రూ.4లక్షల నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. ఈ ల్యాబ్‌లో 12 కంప్యూటర్లు ఏర్పాటుచేయగా తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ బోధన కోసం ఇన్‌స్ట్రక్టర్‌కు నెలనెలా రూ.10 వేల వేతనం చెల్లించనున్నట్లు నోష్ ల్యాబ్ బాధ్యులు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ పటిష్టతలో ఏఐఎస్‌ఎఫ్ పాత్ర కీలకం


సీపీఐ సభ్యత్వం అందజేస్తున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ పార్టీ పటిష్టతలో ఏఐఎస్‌ఎఫ్ పాత్ర మరువలేనిదని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన పలువురికి సభ్యత్వాలు అందజేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. అంతేకాక ప్రజాసమస్యలపై జరిగిన పోరాటాల్లోనూ భాగస్వామ్యం అయిందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రావి శివరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, కూచిపూడి రవి, నాగుల్ మీరా, శివనాయక్, హరికృష్ణ, ఉజ్వల్, రోహిత్, గోపి, రాకేష్, సాయి, సందీప్, పవన్, రాజు, ప్రతాప్, రవి, గణేష్, సునీల్ పాల్గొన్నారు.

'తోపుడు బండి' ఆగదు..

- సాదిక్ అలీ బాటలోనే సేవా కార్యక్రమాలు


సాదిక్ అలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి ఉష, తదితరులు

కల్లూరురూరల్: తోపుడు బండి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాదిక్ అలీ బాటలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని వక్తలు వెల్లడించారు. ఇటీవల మృతి చెందిన సాదిక్ సంస్మరణ సభ గురువారం కల్లూరులో నిర్వహించగా పలువురు పాల్గొన్నారు. తొలుత ఆయన భార్య ఉష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తోపుడు బండి ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్, షూస్, డ్రెస్‌లు అందించారని గుర్తు చేశారు. అంతేకాక పలువురి ఉన్నత చదువులకు అండగా నిలిచారని తెలిపారు. అనంతరం ఎంఈఓ పి.నివేదిత మాట్లాడగా 106 మంది విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగపద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం పాదిలి పద్మతో పాటు ఫయాజ్ అలీ, కిషోర్‌దత్, విజయకుమార్, పెద్దబోయిన దుర్గాప్రసాద్, లక్ష్మణ్‌రావు, వరక రామారావు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంతకుమార్

తల్లాడ: రైతుల పంటల సాగులో భాగంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అశ్వారావుపేట వ్యసాయ కళాశాల అసోసియేట్ డీన్ జె.హేమంతకుమార్ సూచించారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో గురువారం వైరా కేవీకే, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్, వైరా కేవీకె కోఆర్డినేటర్ కె.రవికుమార్ మాట్లాడుతూ రైతులు ఆధునిక విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని తెలిపారు. అనంతరం సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు జెస్సీ సునీత, ఫణిశ్రీ, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు ఆర్.రమేష్, డాక్టర్ పి.ఝాన్సీరాణి, కె.శిరీష, ఏఈఓ త్రివేణి తదితరులు వ్యవసాయంలో వస్తున్న మార్పులను వివరించారు. అలాగే, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు అంశాలను ప్రదర్శనల రూపంలో రైతులకు తెలియచేశారు.

ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీపై ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల పేరిట దోపిడీ తారస్థాయికి చేరిన నేపథ్యాన ఉద్యమం చేపట్టనున్నట్లు పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.ప్రదీప్ వెల్లడించారు.పీవైఎల్, పీఓడబ్ల్యూ ముఖ్య నాయకుల సమావేశం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరగగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీతో ప్రజలు సర్వం కోల్పోతున్నా పాలకులు పట్టించుకోవడం విమర్శించారు. మరోపక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి సారించడం లేదని తెలిపారు. ఈవిషయమై రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఉద్యమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌సింగ్, ఎస్.వీ.రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, నాయకులు టి.ఝాన్సీ, మామిడాల వెంకటేష్, డి.చందు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు పోటీలకు హాజరుకాగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందించారు. సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు దండా ప్రవీణ్, ఎర్రబోయిన నర్సయ్య, జెర్రిపోతుల అంజిని, చిట్యాల రమేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, దండా సత్యనారాయణ, ఇస్లావత్ బాలాజీ, దండా వెంకటేశ్వర్లు, ఆర్.నవీన్, కె.ఉపేందర్, సుధీర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

రాజేశ్వరపురంలో ఏర్పాటుచేసిన మహిళా కబడ్డీ పోటీలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మహిళల్లో క్రీడాస్ఫూరిని నింపేందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

సత్తా చాటిన కేంద్రియ విద్యాలయం విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీఈటీలు

ఖమ్మం రూరల్/ఖమ్మం స్పోర్ట్స్: కేంద్రియ విద్యాలయాల సమితి హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యాన ఈ ఏడాది ఇప్పటివరకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో ఖమ్మం రూరల్ మండలం పోలెపల్లిలోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పలు పతకాలు సాధించారు. క్రీడాకారులు మొత్తం 91 బంగారు, 50 వెండి, 55 కాంస్య పతకాలు దక్కించుకోగా, పలువురు జాతీయస్థాయి పాఠశాలలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కవీంద్రారాయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, సెప్టెంబర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 17మంది పతకాలు సాధించారని వెల్లడించారు. వాలీబాల్, రోప్‌స్కిప్పింగ్, యోగా, బాక్సింగ్, ఆర్చరీ, స్కేటింగ్, అథ్లెటిక్స్‌ల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు పీఈటీలు భువన, విజయ్‌కుమార్, కోచ్‌లు మల్లయ్య, కోదండరామ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

మేం హ్యూమన్‌రైట్స్ సభ్యులం !

- సీపీ కార్యాలయానికి వచ్చిన నకిలీలపై కేసు

ఖమ్మంక్రైం: మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా చెబుతూ ఏకంగా పోలీసు కమిషనర్‌ను కలవాలని వచ్చిన ఇద్దరిపై అనుమానంతో ఆరా తీయగా నకిలీలని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాలు... విజయవాడకు చెందిన పురాణం పద్మజ, శ్రీపతి జగదీష్‌కుమార్ తాము హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులమని నకిలీ గుర్తింపు కార్డులతో ఉమ్మడి రాష్ట్రాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులను బెదిరిస్తున్నారని తెలిసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి వద్ద డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. ఖమ్మం ఖానాపురానికి చెందిన సురేష్ వద్ద కూడా గతంలో డబ్బులు తీసుకుని ముఖం చాటేశారు. ఈక్రమాన గురువారం ఖమ్మం ప్రకాష్‌నగర్‌లోని సీపీ కార్యాలయానికి వచ్చి కమిషనర్‌ను కలవాలంటూ గుర్తింపు కార్డులు చూపించారు. అయితే, ఇప్పటికే వీరిపై నిఘా ఉండడంతో త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అసలు స్వరూపం బయటపడింది. దీంతో పద్మ, జగదీష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అంత్యక్రియలకు వచ్చివెళ్తూ ప్రమాదంలో మృతి

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెం సమీపాన రోడ్డు ప్రమాదంలో కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన రైతు అనుమంచినేని నర్సింహరావు(43) మృతి చెందాడు. సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాలు... బల్లేపల్లికి చెందిన నర్సింహరావు మిత్రుడి తండ్రి మృతి చెందగా బైక్‌పై గురువారం వచ్చిన ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నాక తిరిగి బయలుదేరాడు. ఈక్రమాన శివాయిగూడెం బస్టాప్ వద్ద ఇల్లెందు వైపు నుండి ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో నర్సింహరావు తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

మహిళపై అత్యాచారం.. కేసు నమోదు

బోనకల్: మండలంలోని మోటమర్రికి చెందిన ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు. సదరు వివాహిత ఈనెల 11న ఊరిలో పని చేసుకొని ఇంటికి వెళ్తుండగా దర్శికుంట కోటయ్య బలవంతంగా మేకల షెడ్‌లోకి లాక్కెళ్లి మద్యం తాగించి అత్యాచారం చేశాడు. ఈ ఘటనలో ఆమె ఛాతిపై గాయాలయ్యాయి. అనంతరం ఆమె భర్తకు విషయాన్ని చెప్పగా బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.